సాక్షి

బాపట్ల

సోమవారం : 2 : డిసెంబర్ : 2024



కార్తిక పూజలు

మంగళగిరి : లక్ష్మీనృసింహస్వామి, గంగా భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామి ఆలయాలకు ఆదివారం భక్తులు పోటెత్తారు. కార్తిక దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు.



పట్టువస్త్రాలు సమర్పణ

దాచేపల్లి: స్థానిక వీర్ల అంకమ్మ అమ్మవారికి ఆదివారం తంగెడ నరసింహారావు దంపతులు పూజలు చేసి పసుపు, కుంకుమతో పాటు పట్టు వస్త్రాలు సమర్పించారు.

మల్లికార్జునస్వామికి అన్నాభిషేకం



గుంటూరు ఎడ్యుకేషన్: గుంటూరు నగరంలోని మల్లిఖార్జున పేటలో ఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి వారి దేవస్థానంలో ఆదివారం అన్నాభిషేకం నిర్వహించారు. విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

ఎయిడ్స్‌పై అవగాహనతోనే అడ్డుకట్ట

డీఎంఅండ్‌హెచ్‌ఓ ఎస్.విజయమ్మ



బాపట్ల: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరిలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్యాధికారిణి డాక్టరు ఎస్. విజయమ్మ పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ఆదివారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక అంబేడ్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టరు ఎస్.విజయమ్మ మాట్లాడారు. ఎయిడ్స్‌పై అవగాహనతోనే అడ్డుకట్ట సాధ్యమని తెలిపారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. హెచ్ఐవీ సోకిన తరువాత ఎయిడ్స్‌గా మారకముందే జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధిని నియంత్రించవచ్చని సూచించారు.2030నాటికి పూర్తిగా నియంత్రించాలనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బాపట్ల ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వాణీ జ్యోతి, జిల్లా లెప్రసీ అధికారి డాక్టరు రోహిణి పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి చెరువులో విద్యార్థి గల్లంతు



చినగంజాం: చెరువులో ఈతకు వెళ్లి ఓ విద్యార్థి గల్లంతైన ఘటన ఆదివారం మండలంలోని పర్చూరు మండలం వీరన్నపాలెంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. వీరన్నపాలెం గ్రామానికి చెందిన పాలేరు శ్రీనివాసరావు కుమారుడు జస్వంత్ (17) చీరాల భారతి డిగ్రీ కాలేజీలో మొదటి సంవత్సరం డిగ్రీ చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో గ్రామంలోని పడమటి దిక్కునున్న చెరువులో సరదాగా ఈత కొట్టేందుకు సాయంత్రం 5.30 గంటల సమయంలో వెళ్లాడు.ఆ తర్వాత కుమారుడు కన్పించకుండా పోవడంతో తండ్రి శ్రీనివాసరావు చెరువులో వెతికించాడు. సుమారు 10 మంది గజఈతగాళ్లు వెతికినప్పటికీ ఆచూకీ దొరకలేదు. పర్చూరు ఎస్ఐ మాల్యాద్రి ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని, చీరాల నుంచి ఫైర్ సిబ్బందిని పిలిపించి గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం రాత్రి బాగా పొద్దుపోయేంత వరకు చెరువులో ఈతగాళ్లు, ఫైర్ సిబ్బంది వెదికినా జస్వంత్ ఆచూకీ తెలియరాలేదు. దీంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరవుతున్నారు. పాలేరు శ్రీనివాసరావు దంపతులకు ఇద్దరు కుమారులు కాగా జస్వంత్ రెండో వాడు.

రిషితేశ్వరికి న్యాయం చేయాలి



లక్ష్మీపురం: విద్యార్థిని రిషితేశ్వరికి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా మాజీ కార్యదర్శి లక్ష్మణరావు, ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ డిమాండ్ చేశారు. రిషితేశ్వరి ఆత్మహత్య కేసు కొట్టివేయటం చాలా బాధాకరమని తెలిపారు. ర్యాగింగ్ తట్టుకోలేక చనిపోయిన విద్యార్థినికి న్యాయం చేయకుండా ఇలాంటి తీర్పు న్యాయస్థానం ఇవ్వటం ఆశ్చర్యం కలిగించిందన్నారు. ఈ కేసులో నిందితులను శిక్షించాలని ప్రభుత్వం అప్పీలు చేయాలని డిమాండ్ చేశారు. శంకర్ విలాస్ సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ, ఐద్వా, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో 2015లో ఆర్కిటెక్చర్ చదువుతున్న రిషితేశ్వరి ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుందని గుర్తుచేశారు. చనిపోయే ముందు సూసైడ్ నోట్‌లో తన ఆత్మహత్యకు కారణం ర్యాగింగ్ అని, సీనియర్ విద్యార్థులు వేధిస్తున్నారని వివరంగా రాసినట్లు తెలిపారు. తొమ్మిది సంవత్సరాలుగా కేసు విచారణ కోర్టులో నడుస్తోందని, ఇప్పుడు కేసు కొట్టి వేయడం చాలా బాధాకరంగా ఉందన్నారు. ఈ కేసులో నిందితులకు శిక్ష పడేలా ప్రభుత్వం అప్పీల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి మద్దతు తెలియజేసిన వారిలో అనూరాధ, స్వాతి, బాషా, ఐద్వా నాయకురాలు రమణ, పద్మ ఉన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, జిల్లా అధ్యక్షులు షేక్ సమీర్, నగర అధ్యక్షుడు యశ్వంత్, నగర సభ్యులు నరేంద్ర, సుభాని, షంషీర్, శివాజీ, సందీప్, బాబు, రిహాన్, భాను తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొను గోల్‌మాల్

ప్రభుత్వం ఆర్భాటంగా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలు అలంకారప్రాయంగా మారాయి. రైతులను ఆదుకోవడం లేదు. ధాన్యం కొనుగోలులో అధికారులు ముప్పతిప్పలు పెడుతున్నారు. తొలుత 17 లోపు తేమశాతం ఉంటే ధాన్యం కొంటామని ప్రభుత్వం ప్రకటించింది. ఫెంగల్ తుపాను ప్రభావంతో దాన్ని 20 శాతానికి పెంచినా కొత్త మెలిక పెట్టింది. బస్తాకు ఐదు కిలోల మేర ధాన్యంలో కోత విధించింది. దీంతో రైతులు గిట్టుబాటు ధరకు ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. చేసేదిలేక దళారుల ద్వారా మిల్లర్లకు అమ్ముకుంటున్నారు.



భట్టిప్రోలు మండలంలో మిల్లుకు తోలుతున్న ధాన్యం

కొనుగోలు కేంద్రాల్లో నిబంధనలతో రైతులకు ఇక్కట్లు

- తేమ ధాన్యం కొనకుండా అధికారుల సాకులు
- 20 శాతం తేమతో కొంటామంటూ బస్తాకు ఐదు కిలోలు కోత
- ఫెంగల్ తుఫాను ఎఫెక్ట్‌తో ధాన్యం ఆరబోతకు అడ్డంకులు
- తప్పని పరిస్థితిలో మిల్లర్లకు అమ్ముకుంటున్న రైతులు
- అన్నదాత సుఖీభవ ఇవ్వకపోవడంతో మిల్లర్ల వద్ద అప్పులు తెచ్చుకున్న రైతులు
- పండించిన ధాన్యంలో 85 శాతం పైగా దళారులకు అమ్ముతున్న వైనం
- 75 కిలోల బస్తా రూ. 1400కే విక్రయించి నష్టపోతున్న అన్నదాతలు
- పేరుకు రూ. 1740 ధర ప్రకటించినా కొనని ప్రభుత్వం
- ఇప్పటివరకు 700 టన్నుల మాత్రమే ధాన్యం కొనుగోలు



వేమూరు మండలంలో మిల్లుకు తరలిస్తున్న ధాన్యం

సాక్షి ప్రతినిధి, బాపట్ల : తుపాను ముంచుకొస్తుందన్న ఆందోళనతో రైతులు ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేదు. ఆదుకోవాల్సిన ప్రభుత్వం కూడా ఆదుకోకపోవడంతో రూ. 1400కే దళారుల ద్వారా మిల్లర్లకు తెగనమ్ముకొంటున్నారు. ప్రభుత్వం పేరుకు బస్తాకు రూ. 1740 ఇస్తామని చెప్పినా తేమ శాతం అంటూ మెలిక పెట్టింది. దీంతో రైతులు ధాన్యం అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది.

పేరుకే కొనుగోలు కేంద్రాలు

బాపట్ల జిల్లావ్యాప్తంగా ప్రభుత్వం 150 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలోని 78 చోట్ల మాత్రమే సేకరణ మొదలుపెట్టారు. ఇప్పటివరకు 700 టన్నులు మాత్రమే కొనుగోలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇది ప్రభుత్వ నిర్లక్ష్యానికి, నిర్లిప్తతకు అద్దం పడుతోంది. ప్రభుత్వం పేరుకు 20 శాతం తేమ ఉన్నా కొంటామని చెబుతూ ఐదు కిలోల ధాన్యం కోతపెట్టి వంచనకు పాల్పడుతోంది. ప్రభుత్వ తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చేసేదిలేక 85 శాతానికి పైగా దళారుల ద్వారా నేరుగా మిల్లర్లకు ధాన్యం అమ్మారు.

పైసా ఇవ్వని కూటమి ప్రభుత్వం

ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పేరుతో పెట్టుబడి సాయం కింద రూ. 20 వేలు ఇస్తామని చెప్పిన కూటమి నేతలు అధికారంలోకి రాగానే పైసా ఇవ్వలేదు. దీంతో పేద రైతులతో పాటు 90 శాతం వరకూ ఉన్న కౌలు రైతులు దళారుల ద్వారా పెట్టబడి సాయం కోసం మిల్లర్లను ఆశ్రయించారు. ఎకరాకు రూ. 20 వేలు చొప్పున తెచ్చుకున్నారు. ఇప్పుడు గత్యంతరం లేక ధాన్యాన్ని మిల్లర్లకు తక్కువ ధరకే తెగనమ్ముకుంటున్నారు. ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించి ఉంటే రైతులు దర్జాగా కొనుగోలు కేంద్రాల్లో గిట్టుబాటు ధరకు అమ్ముకునే అవకాశం ఉండేది.

దిగుబడి బాగున్నా ధర లేదు

బాపట్ల జిల్లా వ్యాప్తంగా బాపట్ల, రేపల్లె, చీరాల వ్యవసాయ డివిజన్ల పరిధిలో ఖరీఫ్‌లో 2,16,434 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. 5,62,729 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా. ఇప్పటికి ఐదు వేల ఎకరాల్లో కోతలు పూర్తి చేశారు. తుపాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా మూడు రోజుల నుంచి తేలికపాటి వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే యంత్రాల ద్వారా కోతలు కోసిన ధాన్యాన్ని రైతులు ఆరబెట్టుకునే అవకాశం లేదు. కొనుగోలు కేంద్రాలను ఆశ్రయిస్తే తేమ శాతం అధికంగా ఉందంటూ ప్రభుత్వం కొనుగోలు చేయడంలేదు. ఒకవేళ కొన్నా రైతులకు గోనె సంచులు, కూలీ, ట్రాన్స్‌ఫోర్ట్ చార్జీలు ఇవ్వటం లేదు. దీంతో రైతులు గత్యంతరం లేక మిల్లర్లకు ధాన్యం అమ్ముకుంటూ దగా పడుతున్నారు. రైతుల ఆదుర్దాను మిల్లర్లు క్యాష్ చేసుకుంటున్నారు. బస్తా ధాన్యం రూ. 1400కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. ఈ లెక్కన ఖర్చులు మాత్రమే గిట్టుబాటు అవుతున్నాయి. ఆరుగాలం శ్రమించిన రైతులకు చివరకు శ్రమే మిగులుతోంది.

గత్యంతరం లేక మిల్లుకు అమ్ముకున్నా..



నేను 10 ఎకరాల్లో వరి సాగు చేశా. ఎకరానికి 35 బస్తాల దిగుబడి వచ్చింది. బస్తా రూ. 1400 చొప్పున మిల్లుకు అమ్మా. పేరుకు ప్రభుత్వం బస్తా రూ. 1740కి కొంటామని కేంద్రాలు తెరిచినా అక్కడ తేమ శాతం మొదట 17లోపు ఉండాలన్నారు. ఇప్పుడు 20 శాతంలోపు అని చెప్పినా బస్తాకు ఐదు కిలోలు అదనంగా ఇవ్వాలంటున్నారు. దీంతో రైతుకు మరింత నష్టం. పైగా తుపాను వల్ల చిరు జల్లులు పడుతున్నాయి. ధాన్యం ఆరబెట్టుకునే పరిస్థితి లేదు. పొలంపైనే ఉంటే మొత్తం పాడైపోతుంది. అందుకే తక్కువ ధర అయినా మిల్లుకు అమ్ముకున్నా.

– రాయపూడి బుజ్జిబాబు, బలిజపల్లి, వేమూరు మండలం

ఆరబెట్టుకునే వసతి లేక అమ్మేశా..



నేను రెండు ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశా. అధికారులు బస్తా రూ. 1740కి కొంటామని చెప్పారు. మొదట తేమశాతం 17లోపు ఉండాలన్నారు. తిరిగి ఇప్పుడు 20 శాతంలోపు ఉన్నా కొంటామని చెప్పారు. ఇందుకు బస్తాకు ఐదు కిలోల ధాన్యం అదనంగా ఇవ్వాలన్నారు. దీంతో మేము మరింత నష్టపోతాం. అందుకే బస్తా రూ. 1400 చొప్పున ప్రైవేటు మిల్లుకు ధాన్యం అమ్మా. తుపానులో ధాన్యం ఆరబెట్టుకునే వసతి లేదు. నిలువ ఉంచితే మొత్తం పాడైపోతుంది. అందుకే తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చింది.

– ఈపూరు యోహాన్, కౌలు రైతు, వరహాపురం, వేమూరు మండలం,

ఏఎన్‌యూలో కొనసాగిన కమిటీ విచారణ

- విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా సమావేశాలు
- కమిటీ ముందు సమస్యలపై గళం విప్పిన విద్యార్థినులు
- కలుషిత ఆహారంతోపాటు నీరు, పరిసరాల అపరిశుభ్రతపై ఫిర్యాదు



సమావేశం అనంతరం బయటకు వస్తున్న అధికారులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం మహిళా వసతి గృహంలో భోజనంలో పురుగులు, జెర్రి, కప్ప వంటివి వచ్చాయని విద్యార్థినులు చేపట్టిన నిరసనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిటీ ఆదివారం కూడా యూనివర్సిటీలో పర్యటించింది. విద్యార్థినులు, సిబ్బంది, అధికారులతో వేర్వేరుగా కమిటీ సమావేశమైంది. విచారణ కమిటీ సభ్యులైన తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, జిల్లా సివిల్ సప్లైస్ అధికారి పద్మజ, ఫుడ్ సేఫ్టీ అధికారి రవీందర్ రెడ్డిలు విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులు తమ ఇబ్బందులపై గళం విప్పారు. తమకు పెట్టే భోజనంలో గాజు పురుగులు, జెర్రి, కప్పలాంటివి వస్తున్నాయని వాపోయారు. తాగునీటితోపాటు వినియోగించే నీరు కలుషితంగా ఉందని వెల్లడించారు. వాటర్ ట్యాంకుల నీటిలో తల వెంట్రుకలు ఉండడంతోపాటు వంట తయారు చేసే పరిసరాలు నాచుతో అపరిశుభ్రంగా ఉంటున్నా ఎవరూ పట్టించుకోవడం లేదన్నారు. తమ సమస్యలను పలుమార్లు చీఫ్ వార్డెన్‌కు చెప్పామని తెలిపారు. ఆమె వాటిని పరిష్కరించకపోగా, తమపై బెదిరింపులకు పాల్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహాల్లో ఆహారం తినలేక కొందరు ఇళ్లకు వెళ్లిపోయారని తెలిపారు. చీఫ్ వార్డెన్, ఇతర వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని కమిటీని కోరారని సమాచారం. అనంతరం కమిటీ సభ్యులు అక్కడి సిబ్బందితో సమావేశం అయ్యారు. అనంతరం వసతి గృహాలు, యూనివర్సిటీ అధికారులతో కూడా వేర్వేరుగా భేటీలు నిర్వహించారు. చివరికిగా మరోమారు విద్యార్థినులతో సమావేశం అయ్యారు. అన్ని అంశాలతో కమిటీ సోమవారం ప్రభుత్వానికి నివేదిక సమర్పించనుంది.

కత్తులతో 'వీర'ంగం



వీరుల గుడిలో కత్తి సేవలు చేస్తున్న వీరాచారులు

- ఉప్పొంగిన వీరావేశం
- ముగిసిన రాయబార ఉత్సవ ఘట్టం
- పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే జూలకంటి

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో వీరాచారులు కత్తులతో వీరంగమాడారు. అలనాటి వీరుల పౌరుష పరాక్రమాలను తలుచుకుని వీరావేశంతో ఊగిపోయారు. వీర మహిళలూ పూనకాలతో పులకించిపోయారు. మెడలో వీరతాళ్లు, చేతుల్లో ఆయుధాలతో రణక్షేత్రంలో కలియతిరుగుతూ అలనాటి పల్నాటి వీరులను గుర్తుకు తెచ్చారు. వీరుల ఆయుధాల గంటల సవ్వడితో రణక్షేత్రం పరవశించింది. పల్నాటి వీరారాధన ఉత్సవాలలో భాగంగా ఆదివారం రాయబారం ఉత్సవ ఘట్టం కొనసాగింది. వీరాచారులు నాగులేరు ఒడ్డున రంగు రంగుల ముగ్గులు పెట్టారు. వీర తాళ్లు, కత్తులను, ఆయుధాలను, వీర్లంకమ్మ బుట్టలు నాగులేరులో శుభ్రపరచి ముగ్గు మధ్యలో ఆయుధాలు ఉంచారు. కొబ్బరి కాయలు కొట్టి క్రతువులు నిర్వహించారు. ఆయుధాల చుట్టూ వీరంగమాడారు. తర్వాత ఆయుధాలతో తయారు చేసుకున్న నైవేద్యాలతో వీరుల గుడి నుంచి సంప్రదాయ డోలు సన్నాయి మేళంతో గ్రామోత్సవం నిర్వహించారు. చెన్నకేశవస్వామి, వీర్ల అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ఆశీస్సులు తీసుకుని అక్కడ కత్తి సేవలు చేసుకున్నారు. తర్వాత బ్రహ్మనాయుడు విగ్రహానికి పూలమాలలు వేసి ధూపం వేసి కత్తి సేవ చేశారు. కోట బురుజు మీదగా పీఠాధిపతి పిడుగు తరుణ్ చెన్నకేశవ ఇంటికి చేరి అక్కడ కత్తి సేవలు నిర్వహించారు. అనంతరం వీరుల గుడికి చేరుకుని వీరుల ఆయుధాలను వీరుల గుడిలో ఉంచారు. గుడిలో ఆయుధాలను దర్శించుకోడానికి భారీగా ప్రజలు తరలివస్తున్నారు. రాత్రి వీర్ల గుడిలో రాయబారం కథాగానాన్ని వీర విద్యావంతులు ఆలపించారు. అరణ్యవాసం అనంతరం మాచర్ల రాజ్యభాగం బావ మలిదేవునికి ఇవ్వాలని గురజాలలోని మామ నలగామరాజు వద్దకు అలరాజు రాయబారం వెళ్లిన ఘట్టాన్ని చాలా ఆసక్తికరంగా ఆలపించారు.

ఎంపీ, ఎమ్మెల్యే పూజలు

పల్నాటి ఉత్సవాలలో నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు. మొదట వీరుల గుడిలో ఆయుధాలకు పూజలు చేశారు. అనంతరం చెన్నకేశవస్వామి, అంకాలమ్మ ఆలయాలలో పూజలు నిర్వహించారు. తర్వాత రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో జరుగుతున్న న్యూ కేటగిరి విభాగం ఎడ్ల పోటీలను ఎంపీ, ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎడ్ల జతల యజమానులను పోటీల నిర్వాహకులను సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. ఎంపీ, ఎమ్మెల్యేలను నిర్వాహకులు సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నేడు చాపకూడు అమలు

ఉత్సవాలలో భాగంగా సోమవారం మందపోరు ఉత్సవ ఘట్టం జరగనుంది. ఈ రోజు బ్రహ్మనాయుడు చాపకూడు సిద్ధాంతాన్ని అమలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. సహపంక్తి భోజనాల ద్వారా సమతావాదాన్ని చాటిన బ్రహ్మనాయుడు ఆదర్శాన్ని అమలు చేయనున్నారు. వీరుల గుడి ఆవరణలోని బ్రహ్మనాయుడు చాపకూడు మండపం ఆవరణలో వేలాది మందికి భోజనాలు పెట్టనున్నారు. చాపకూడు అమలు కార్యక్రమంలో ఎమ్మెల్యేతోపాటు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ పెద్దలు, కలెక్టర్, ఎస్పీ పాల్గొనే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.



వీరుల గుడికి తరలివస్తున్న వీరాచారులు

శివయ్య సన్నిధిలో కార్తిక సందడి



రాహుకేతు పూజల్లో పాల్గొన్న భక్తులు

- దీప కాంతులతో కళకళలాడిన ఆలయం
- ముగిసిన కార్తిక మాస పూజలు
- రాహుకేతు పూజలకు భారీగా భక్తులు



కార్తిక దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న భక్తులు


పెదకాకాని: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీభ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానం భక్తులతో కళకళలాడింది. కార్తిక మాసం చివరి ఆదివారం కావడంతో ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేసేందుకు అధికసంఖ్యలో తరలివచ్చారు. తెల్లవారుజామున ఆలయ ప్రాంగణంలోని యజ్ఞాల బావి స్నానాలు చేసి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దీపాలు వెలిగించి పూజలు చేశారు. అనంతరం భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆలయంలో అధికంగా తలనీలాలు, వాహన పూజలు, అన్నప్రాసనలు, అంత్రాలయ దర్శనాలు, అభిషేకాలు, రాహుకేతు పూజలు, నవగ్రహ పూజలు జరిగాయి. రాహుకేతు పూజలకు 1,261 టికెట్లు విక్రయించారు. మండపం వద్ద ఆదివారం అమావాస్యను పురస్కరించుకుని టెంట్లు, క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. తెల్లవారి నుంచే పూజలు ప్రారంభమయ్యాయి. ఈ టికెట్ల విక్రయం ద్వారానే రూ.6.50 లక్షల ఆదాయం సమకూరింది. ఒక్క రోజులో స్వామివారి ఆదాయం రూ.10 లక్షలు సమకూరినట్లు డిప్యూటీ కమిషనర్ కె.బి. శ్రీనివాస్ తెలిపారు. పెదకాకాని పోలీసులు ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా బందోబస్తు నిర్వహించారు. అగ్నిమాపక శాఖ, పంచాయతీ రాజ్ శాఖ, వైద్య విభాగం సహకారం అందించినట్లు డీసీ తెలిపారు.



బారులుదీరిన భక్తులు

సత్తా చాటిన వెయిట్ లిఫ్టర్లు





బంగారు పతకాలు సాధించిన లోగేశ్వరన్, రజత్ రాయ్



మూడో స్థానం పొందిన ప్రేమ్ సాగర్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సౌత్, వెస్ట్ జోన్ అంతర్ విశ్వవిద్యాలయాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో రెండో రోజైన ఆదివారం పలు కేటగిరీల్లో వెయిట్ లిఫ్టర్లు విశేష ప్రతిభ కనబరిచారు. రెండో రోజు ఫలితాలను పోటీల నిర్వాహక కార్యదర్శి, వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పీపీఎస్ పాల్ కుమార్ వెల్లడించారు.

విజేతలు వీరే...

- 67 కేజీల విభాగంలో తొలి మూడు స్థానాల్లో మదురై కామరాజు యూనివర్సిటీ లిఫ్టర్ షెన్ బాగా రాజ్, మనోన్మనియం సుందరనార్ యూనివర్సిటీ లిఫ్టర్ ఎం.గోపి సుదర్శన్, ఎస్ఆర్ఎం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లిఫ్టర్ కె.గురుకన్నన్ నిలిచారు.
- 73 కేజీల విభాగంలో తిరువళ్లువర్ యూనివర్సిటీ లిఫ్టర్ లోగేశ్వరన్, ఆంధ్ర కేసరి యూనివర్సిటీ లిఫ్టర్ ఎస్‌వీ. మహేష్, తిరువళ్లువర్ యూనివర్సిటీ లిఫ్టర్ ఎ. మనోబాల పతకాలు కైవసం చేసుకున్నారు.
- 81 కేజీల కేటగిరిలో మంగళూరు యూనివర్సిటీ లిఫ్టర్ బి. రజత్ రాయ్, మనోన్మనియం సుందరనార్ యూనివర్సిటీ క్రీడాకారుడు ఎస్ఎస్. అభిషేక్, యోగి వేమన యూనివర్సిటీ క్రీడాకారుడు దేవరకొండ ప్రేమ్ సాగర్ తొలి మూడు బహుమతులు పొందారు.

క్లుప్తంగా

జీసీటీఏ జిల్లా నూతన కమిటీ ఎన్నిక



అద్దంకి రూరల్: ప్రభుత్వ కళాశాలల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) బాపట్ల జిల్లా నూతన కమిటీ ఎన్నిక ఆదివారం బాపట్ల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. అధ్యక్షుడు, సెక్రటరీలుగా అద్దంకి కేఆర్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకుడు మహమ్మద్ నయీం, బి. అశోక్ కుమార్, మహిళా సెక్రటరీగా చిలక అనిత, కోశాధికారిగా రేపల్లెకు చెందిన డి. సంపూర్ణరావు ఎన్నికైనట్లు నూతన అధ్యక్షుడు తెలిపారు.

మహాభారతం మానవాళికి దిక్సూచి



అద్దంకి రూరల్: మహాభారతం మానవాళికి దిక్సూచిలాంటిదని శాసన పరిశోధకుడు జ్యోతి చంద్రమౌళి అన్నారు. స్థానిక మారం వారి సేవా సదన్‌లో ఆదివారం సాహితీ మిత్రమండలి ఆధ్వర్యంలో లక్కరాజు శ్రీనివాసరావు రచించిన 'మహాభారతం జాతీయాలు-సంఘటనలు' పుస్తకాన్ని జ్యోతి చంద్రమౌళి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ భారతంలోని పాత్రల గురించి మెరుగైన అవగాహనకు ఈ పుస్తకం తోడ్పడుతుందని తెలిపారు. చాలా మందికి తెలియని అనేక అజ్ఞాత అంశాలను రచయిత వెలికితీసి, పాఠకులకు ఏకకాలంలో ఆశ్చర్యాన్ని, ఆనందాన్ని కలగజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్కరాజు చంద్రశేఖర్, శివరామప్రసాద్, ఆర్‌పీ రాఘవరావు, గాడేపల్లి దివాకరదత్తు, చందులూరి నారాయణరావు, అన్నమనేని వెంకటరావు, పుట్టంరాజు శ్రీరామ చంద్రమూర్తి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, ఉబ్బా దేవపాలన, మోటుపల్లి రామదాసు, పీసీ కోటయ్య, వారణాశి రఘురామశర్మ, చెన్నుపాటి రామాంజనేయులు, పోలిరెడ్డి మరళీ సుధాకరరావు, సాంబశివరావు పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్ పేరుతో సైబర్ మోసాలు

- జిల్లా ఎస్పీ తుషార్ డూడీ
- పెట్టుబడుల పేరుతో వచ్చే లింక్‌లు క్లిక్ చేయవద్దు
- జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ తుషార్ డూడీ

బాపట్ల టౌన్: స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఆన్‌లైన్‌లో జరిగే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో వచ్చే తెలియని లింక్‌లు క్లిక్ చెయ్యవద్దని సూచించారు. ప్రజలు ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడే అవకాశం ఎక్కువగా ఉంటుందని హెచ్చరించారు. ఆఫర్లు, లాభాల పేరుతో నమ్మించి సైబర్ నేరగాళ్లు డబ్బులు కాజేస్తున్నారన్నారు. నకిలీ వెబ్ సైట్లతో లాభాల ఆశచూపి బ్యాంకు ఖాతాలు ఖాళీ చేస్తున్నారని తెలిపారు. ఇటీవల ఆన్ లైన్‌స్టాక్ పెట్టుబడుల మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయని చెప్పారు. బాపట్ల జిల్లా పరిధిలోని ఒక వ్యక్తికి ఇటీవల వాట్సాప్ లో స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో ఓ లింక్ వచ్చిందని, ఆన్ లైన్ ట్రేడింగ్, ఐపీఓలలో పెట్టుబడులు పెట్టడం ద్వారా అధిక లాభాలు వస్తాయని నమ్మించారని ఎస్పీ తెలిపారు. దీంతో బాధితుడు ఆధార్, పాన్ కార్డ్ వివరాలతో ట్రేడింగ్ అకౌంట్ తెరిచి, మొదటగా సైబర్ కేటుగాళ్లు చెప్పిన విధంగా కొంత మొత్తం డిపాజిట్ చేశాడని వివరించారు. నకిలీ ట్రేడింగ్ ఖాతాలో లాభాలు వచ్చినట్లు చూపించారని, అది నమ్మిన బాధితుడు బల్క్ ట్రేడింగ్‌లో భారీ మొత్తంలో పెట్టుబడి పెట్టాడని ఎస్పీ వివరించారు. వారం రోజులు స్టాక్స్ కలిగి ఉంటే, మంచి లాభాలు వస్తాయని మరోసారి నమ్మించారన్నారు. అనంతరం బాధితుడికి లాభాలు కలిపి మొత్తం సుమారు రూ.40 లక్షలు చూపించారని, విత్ డ్రా చేసుకునే ప్రయత్నం చేయడంతో సాధ్యం కాలేదని తెలిపారు. విత్ డ్రా చేసుకోవాలంటే మరింత పెట్టుబడి పెట్టాలని, కమీషన్ ఇతర చార్జీల పేరుతో మరింత డబ్బు ట్రాన్స్‌ఫర్ చేయాలని మోసగాళ్లు ఒత్తిడి చేశారన్నారు. దీంతో మోసపోయానని గ్రహించి బాధితుడు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్పీ వివరించారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, వాటిపై అవగాహన ఉంటే చాలా వరకు తగ్గించవచ్చని తెలిపారు. డబ్బులు ఎవరికీ ఊరికేరావని, కష్టార్జితం సైబర్ నేరస్థులకు పోనివ్వొద్దని సూచించారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1930 కాల్ చేస్తే, పోగొట్టుకున్న డబ్బులను చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందని ఎస్పీ తెలిపారు.

బాబు ష్యూరిటీ.. బాదుడు గ్యారెంటీ

- వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి
- ఎన్నికలకు ముందు విద్యుత్ చార్జీలు పెంచమని ప్రజలకు వాగ్దానం
- అధికారంలోకి వచ్చాక హామీని తుంగలోకి తొక్కిన కూటమి ప్రభుత్వం
- ప్రజలను మోసం చేయడంలో బాబు బ్రాండ్ అంబాసిడర్



చిన హనిమిరెడ్డి

అద్దంకి: ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయాలను గమనిస్తే బాబు ష్యూరిటీ- బాదుడు గ్యారెంటీ అనే చందంగా మారిందని వైఎస్సార్ సీపీ అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సూపర్ సిక్స్ పథకాలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు కూటమి ప్రభుత్వం మరోసారి ప్రజల నడ్డి విరిచేందుకు సిద్ధం అయిందని విమర్శించారు. ఎన్నికలకు ముందు ఎప్పటికీ విద్యుత్ చార్జీలు పెంచబోమని, ట్రూ అప్ చార్జీలు పూర్తిగా ఎత్తేస్తామని ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని తెలిపారు. అధికారంలోకి వచ్చిన మొదటి ఐదు నెలలోనే రెండుసార్లు ట్రూఅప్(సర్దుబాటు) చార్జీలను పెంచిందని పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు తానేమి ఎన్నికలకు ముందు చార్జీలు పెంచమని హామీయే ఇవ్వలేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. తాజాగా రాష్ట్రంలో ప్రజల నుంచి రూ.9,412 కోట్లను సర్దుబాటు చార్జీల కింద వసూలు చేయాలని ఈ ప్రభుత్వం నిర్ణయించిన విషయం అందరికీ తెలిసిందేనన్నారు. దాంతో వినియోగదారుల పైన ఒక్కో యూనిట్‌కి 0.92 పైసలు భారం పడనుందని వివరించారు. ఈ మేరకు వచ్చే ఏడాది జనవరి నుంచి వసూలు చేసేందుకు ఆయా కంపెనీలకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి అనుమతులు ఇవ్వలేదా ? అని పానెం చిన హనిమిరెడ్డి ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యుత్ చార్జిలపై గోలగోల చేసిన ఎల్లో మీడియా ట్రూ అప్ చార్జిల పెంచుతుంటే ఏం చేస్తుందని ప్రశ్నించారు. జగన్ హయాంతో పోలిస్తే నిత్యావసర వస్తువుల ధరల నుంచి, కాలేజీ ఫీజులు సైతం పెరిగాయని విమర్శించారు. ప్రజల ఆదాయాన్ని పెంచుతామన్న చంద్రబాబు కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించి, విద్యుత్ చార్జీల ట్రూ అప్ చార్జిల పెంపును వెనక్కు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

భైరాగి సాహిత్యంతోనే ఈ స్థాయికి చేరా !

డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్



ఆలూరి బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న దృశ్యం

తెనాలి: ఒక వ్యక్తి సాహిత్యంతో పూర్తిగా మారిపోవటం అరుదని, అది తన జీవితంలో జరిగిందని రాజ్యసభ మాజీ సభ్యుడు, హిందీ అకాడమీ విశ్రాంత చైర్మన్ డాక్టర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ చెప్పారు. తాను ఈ స్థాయికి రావటానికి కారణం మహాకవి ఆలూరి బైరాగి సాహిత్యమేనని తెలిపారు. తెనాలికి చెందిన ప్రసిద్ధ కవి ఆలూరి బైరాగి శత జయంతి ప్రారంభ సభను ఆదివారం స్థానిక కవిరాజ పార్కులోని వీజీకే భవన్‌లో నిర్వహించారు. అభ్యుదయ రచయితల సంఘం (అరసం) గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ సభకు అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. అరసం కవితా ప్రవంతిలో భాగంగా తీసుకొచ్చిన 'ఆలూరి బైరాగి కవిత' పుస్తకాన్ని డాక్టర్ లక్ష్మీప్రసాద్ ఆవిష్కరించారు. కాలేజీలో విద్యార్థి నాయకుడిగా ఉద్యమించే రోజుల్లో తన గురువు ఆదేశ్వరరావు ద్వారా బైరాగి కవిత పరిచయమైందన్నారు. పీజీలో బైరాగి సాహిత్యంపై లఘు సిద్ధాంత వ్యాసం రాశానని చెప్పారు. అధ్యాపకుడిగా చేస్తున్నపుడు బైరాగి చివరి రోజుల్లో స్వయంగా ఆయనకు చూపించి సంతకం తీసుకున్నట్టు గుర్తు చేసుకున్నారు. బైరాగి కవిత్వం కాలం గడిచేకొద్దీ మరింతగా సౌరభాలు వెదజల్లుతుందని తెలిపారు. ఆయన సాహిత్యం విస్తృతంగా ప్రజల్లోకి వెళ్లాలని ఆకాంక్షించారు. తిక్కన పదకోశంలానే బైరాగి పదకోశం చాలా అవసరమని చెప్పారు. తెనాలిలో ప్రతిష్ఠించేందుకు బైరాగి విగ్రహాన్ని సమకూరుస్తామని హామీనిచ్చారు. సభాధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. తెలుగు సాహిత్యంలో విశిష్ట స్థానం కలిగిన తెనాలికి చెందిన ఆలూరి బైరాగి మరణం తర్వాత కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించిందని చెప్పారు. అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్ తన ప్రసంగంలో పొరుగు రాష్ట్రాల్లో విస్తృతమవుతున్న గ్రంథాలయోద్యమం, పుస్తక పఠనం పెంపుపై మన రాష్ట్రంలోనూ కృషి జరగాలని అభిప్రాయపడ్డారు. గ్రంథాలయాలకు కొనుగోలు చేసిన పుస్తక రచయితలకు చెల్లించాల్సిన నిధుల విడుదలకు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మాటసాయం చేయాలన్నారు. కనపర్తి బెన్‌హర్ స్వాగతం పలికిన ఈ సభలో డాక్టర్ లక్ష్మీప్రసాద్‌ను తొలుత ప్రముఖ కవి బండ్ల మాధవరావు పరిచయం చేశారు. అరసం జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. తొలుత బైరాగి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

వక్ఫ్ చట్ట సవరణ నిలిపివేయాలి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన వక్ఫ్ చట్ట సవరణను నిలుపుదల చేయాలని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు సెక్రటరీ ఉమ్రైన్ మెహఫూజ్ రెహమాని డిమాండ్ చేశారు. పొన్నూరు రోడ్డులోని మజ్లిస్ ఉలేమా ఆధ్వర్యంలో ఆదివారం ముస్లిం మేధావుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కేంద్రం తక్షణమే 1991 వక్ఫ్ చట్టం కొనసాగించాలని తెలిపారు. దేశ వ్యాప్తంగా వక్ఫ్ చట్ట సవరణను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలపై తమ అభ్యంతరాలు తెలిపారు. కేంద్రం తీసుకువచ్చిన ఈ ప్రతిపాదన వల్ల వక్ఫ్ బోర్డు నిర్వీర్యం అవుతుందన్నారు. ఈ చర్య ముస్లిం వర్గ హక్కులు, మనోభావాలు దెబ్బతీనేలా ఉందన్నారు. వక్ఫ్ చట్ట సవరణ బిల్లు అత్యంత ప్రమాదకరమైనదని, దీని వల్ల ముస్లింల భూములు అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గుంటూరు జిల్లా మజ్లీసుల్ ఉలమా అధ్యక్షులు ముఫ్తి బాసిత్, ముఫ్తి ముజాహిద్, ముఫ్తి అబ్దుల్ ఖవి రషాది, మౌలానా ఇస్మాయిల్, ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి ఆత్మహత్య



శ్రీనివాసరావు మృతదేహం

బల్లికురవ: సాఫ్ట్‌వేర్, అంగన్‌వాడీ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ పదేళ్లుగా నిరుద్యోగ యువతి యువకుల వద్ద లక్షల్లో డబ్బులు వసూలు చేశాడు.. ఉద్యోగాలు దక్కకపోవటంతో మోసపోయామని గ్రహించి ఇంటికి వచ్చి వారం తా గొడవలకు దిగటంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు శీతలపానీయంలో గడ్డి మందు కలుపుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివిధ వైద్యశాలలో 27 గంటలపాటు మృత్యువుతో పోరాడి శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు మృతి చెందాడు. బల్లికురవ ఎస్ఐ జీవీ చౌదరి, గ్రామస్తులు బాధితుల వివరాల మేరకు.. మండలంలోని గొర్రెపాడుకు చెందిన గుంటూరు సీతారామయ్య రెండో కుమారుడు శ్రీనివాసరావు (34) బీటెక్ చదివాడు. 2014 నుంచి 19 వరకు వైజాగ్‌లో కార్యాలయం ఏర్పాటుతో అనేక మంది వద్ద సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ డబ్బు వసూలు చేశాడు. ఉద్యోగాలు ఇప్పించకపోవటంతో అప్పట్లో మోసపోయామని బాధితులు శ్రీనివాసరావు కార్యాలయానికి వెళ్లి గొడవలకు దిగారు. వెంటనే సోషల్ మీడియా సీబీఎస్ ఆర్మీలో చేరి తప్పించుకు తిరిగాడు. అంతటితో ఆగకుండా రెండు సంవత్సరాలుగా అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకుల పోస్టులు ఇప్పిస్తామంటూ మహిళల నుంచి రూ. లక్షల్లో డబ్బు తీసుకున్నాడు. వారికి సమాధానం చెప్పకుండా తప్పించుకు తిరుగుతున్నాడు. ఇటీవల కూటమి ప్రభుత్వం మద్యం షాపులు విచ్చలవిడిగా ఇవ్వడంతో మండలంలోని కొప్పరపాడు వద్ద రెస్టారెంట్ ప్రారంభించాడు. శుక్రవారం ఉద్యోగాలకు డబ్బులిచ్చిన బాధితులు రెస్టారెంట్ వద్దకు వెళ్లి గొడవలు చేసి కుర్చీలు ధ్వంసం చేశారు. ఇంటికి వెళ్లి తండ్రి సీతారామయ్యతో డబ్బులు పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. శుక్రవారం రాత్రి రెస్టారెంట్ నుంచి ఇంటికి రాగానే శ్రీనివాసరావు లోపల పడుకున్నాడు. శీతల పానియంలో గడ్డి మందు కలుపుకుని తాగి వాంతులు చేసుకుంటుండటంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన అద్దంకి వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి ఒంగోలు జీజీహెచ్, చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు వైద్యశాల అక్కడ నుంచి విజయవాడ సమీపంలోని మణిపాల్ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి ఒంటి గంటకు శ్రీనివాసరావు మృతి చెందాడు. మృతుడు అవివాహితుడు. ఎస్ఐ జీవీ చౌదరి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ ఢీకొని చిన్నారి మృతి

బల్లికురవ: ముక్కుపచ్చలారని చిన్నారికి అప్పుడే నూరేళ్లు నిండాయి. అనారోగ్యంతో బాధపడుతుంటే చికిత్స కోసం వెళ్లి వస్తుండగా మార్గంమధ్యంలో మృత్యువు లారీ రూపంలో వెతుక్కుంటూ వచ్చింది. ఈ విషాద ఘటన మండలంలోని వేమవరం విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. అందిన వివరాల మేరకు.. సంతమాగులూరు మండలం కొప్పరం గ్రామానికి చెందిన షేక్ మునీర్ బాషా, భార్య, కుమార్తె షేక్ ఖాన్సా (1)తో కలిసి చిలకలూరిపేట వైద్యశాలకు వెళ్లి బైకుపై గ్రామానికి తిరిగి వస్తున్నారు. చెన్నుపల్లి-అనంతవరం ఆర్అండ్‌బీ రోడ్డులోని వేమవరం విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలోని డొంక చప్టా వద్దకు రాగానే ఎదురుగా లారీ వీరి బైక్‌ను ఢీకొట్టింది. బైక్‌మీద నుంచి చిన్నారి ఖాన్సా కిందపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటన స్థలాన్ని ఎస్సై జీవీ చౌదరి పరిశీలించారు. చిన్నారి మృతితో కుటుంబంలో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలు బట్టతలకు మాత్రలు వాడొచ్చు

డాక్టర్ రుచిత దూరత్



అవార్డు అందజేస్తున్న డాక్టర్ కవిత, డాక్టర్ సౌజన్య, పక్కన డాక్టర్ సీతారామ్ తదితరులు

గుంటూరు మెడికల్: బట్టతల నివారణకు ఇప్పటి వరకు అందరూ లోషన్ వాడుతున్నారని, ముఖ్యంగా మహిళల్లో బట్టతల నివారణకు మినాక్సిడిల్ మాత్రలు వాడటం వల్ల ప్రయోజనం ఉంటుందని ప్రముఖ స్కిన్ స్పెషలిస్ట్ డాక్టర్ రుచిత దూరత్ అన్నారు. గుంటూరు శ్రీ కన్వెన్షల్‌లో నిర్వహిస్తున్న ఐఏడీవీఎల్ ఆంధ్రప్రదేశ్ బ్రాంచ్ 43వ వార్షిక సదస్సు ఆదివారం ముగిసింది. నిరంతర వైద్య విద్య కార్యక్రమం (సీఎంఈ)లో భాగంగా డాక్టర్ రుచిత దూరత్ మాట్లాడుతూ.. బట్టతల నివారణకు ఈ మాత్రలు పురుషులు, స్త్రీలు వాడొచ్చని చెప్పారు. జుట్టును బాగా లాగి గట్టిగా జడ వేయటం ద్వారా వెంట్రుకలు రాలిపోతాయన్నారు. డెర్మటాలజీలో లేజర్ చికిత్స వలన కలిగే ప్రయోజనాలు, ఏ చర్మ సమస్యలకు వీటిని వినియోగించాలనే అంశాలపై డాక్టర్ చంద్రశేఖర్ వివరించారు. ముఖ సౌందర్యం, కేశాలు పెరిగేందుకు అందుబాటులోకి వచ్చిన ఆధునిక ఇంజెక్షన్లు, వైద్య పద్ధతుల గురించి పలువురు వక్తలు మాట్లాడారు. పేపర్ ప్రజెంటేషన్ పోటీల్లో గుంటూరు వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ ఆసియా ఫాతిమాకు ప్రథమ బహుమతి లభించింది. డాక్టర్ ధృతికి బెస్ట్ థీసిస్ ఆన్ సింప్లిఫైడ్ విటిలిగో సర్జరీలో అవార్డును అందజేశారు. తొలుత వరల్డ్ ఎయిడ్స్ డే సందర్భంగా స్థానిక బృందావన్‌గార్డెన్స్ ఎన్‌టీఆర్ స్టేడియంలో సదస్సు నిర్వహించారు. అసోసియేషన్ జాతీయ సెక్రటరీ డాక్టర్ భూమేష్ కుమార్ ముఖ్యఅతిథిగా మాట్లాడారు. హెచ్ఐవీకి ఏ విధంగా వైద్య సేవలు అందించాలి, హెచ్ఐవీ సెక్సువల్ డిసీజెస్ గురించి వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ అత్తోట కవిత, రాష్ట్ర సెక్రటరీ డాక్టర్ సౌజన్య, సదస్సు సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ కె.ఎ.సీతారామ్, కో చైర్‌పర్సన్ డాక్టర్ పి.ఎస్.మోహనరావు, యూనియన్ రాష్ట్ర కోశాధికారి డాక్టర్ నాగేశ్వరరావు, డీఎస్ఎస్ శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసులు

ఐఏడీవీఎల్ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన డాక్టర్ శ్రీనివాసులు, రాష్ట్ర కోశాధికారిగా తిరుపతికి చెందిన డాక్టర్ సజ్జా ప్రకాష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర సదస్సు ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో నూతన రాష్ట్ర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమర్థ నిర్వహణకుగాను అధ్యక్ష, కార్యదర్శులు కవిత, సౌజన్యకు పలువురు అభినందనలు తెలిపారు.

ఓబీసీల 'చలో ఢిల్లీ' జయప్రదం చేయాలి

ఏపీ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



మాట్లాడుతున్న కేసన శంకరరావు

తెనాలి: కేంద్రప్రభుత్వం వచ్చే జనవరి నుంచి చేపట్టనున్న జనగణనతోపాటు సమగ్ర కులగణన జరపాలనే డిమాండ్‌తో ఈ నెల 5, 6వ తేదీల్లో జాతీయ స్థాయిలో ఓబీసీలు నిర్వహిస్తున్న 'చలో ఢిల్లీ'ని జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. 5న ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద భారీ ధర్నా, 6న అఖిలపక్ష సమావేశానికి రాష్ట్రంలోని బీసీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు. స్థానిక బృందావన హోటల్ సమావేశ మందిరంలో బీసీ నాయకులతో కలిసి ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనాదిగా ఓబీసీలు పెత్తందారీవర్గాల అణచివేతకి గురవుతున్నట్టు చెప్పారు. ఓబీసీల సమగ్ర అభివృద్ధితోనే దేశాభివృద్ధి ముడిపడి ఉందన్నారు. కులగణనకు దేశంలోని అన్ని పార్టీలు సుముఖంగా ఉన్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ నాయకులు సమగ్ర కులగణన చేపడితే జాతీయ సమగ్రత దెబ్బతింటుందని చెప్పటం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఇప్పటికైనా ప్రధాని నరేంద్ర మోదీ స్పందించాలని, జనాభా దామాషా ప్రకారం ఓబీసీల రిజర్వేషన్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కుర్రా శ్రీను, ఓలేటి శివాజీ, వేముల కృష్ణ, కొల్లూరు హనుమంతరావు, పి.లక్ష్మీనారాయణ, ఎం.పూర్ణచంద్రరావు, కాళిదాసు, ధనుష్, విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల నిరసన

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు ఆదివారం పోరాట శిబిరం నుంచి ప్రకాష్ నగర్ సెంటర్ వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ మాట్లాడుతూ.. శనివారం అక్రమంగా కార్మికుల గుడిసెలను కూల్చివేశారని పేర్కొన్నారు. దీనికి నిరసనగా ఈ ప్రదర్శన నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్మికుల న్యాయమైన పోరాటానికి అధికారులు మద్దతు ఇవ్వాలని కోరారు. కోర్టు తీర్పుల ప్రకారం కార్మికులకు నష్టపరిహారం ఇవ్వకుండా జాప్యం చేయడం తగదన్నారు. కనీసం నోటీసులు ఇవ్వకుండా, ముందస్తు సమాచారం లేకుండా గుడిసెలను కూల్చివేయడం సరికాదని పేర్కొన్నారు. సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ, రూరల్ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, పల్లె కృష్ణ, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొట్టే కరుణాకర్ రావు, సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు, బి.ప్రకాష్, ఆశీర్వాదం, బి. వెంకయ్య, సాంబశివరావు, యెహోషువా, బాషా, రమాదేవి, ఎం.శారద, సారమ్మ, సామ్రాజ్యం, హిమాంబి, దుర్గమ్మ, నాని, నాగేశ్వరరావు, సుబ్బారావు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ కోసం వెళ్లి బాలుడి దుర్మరణం

ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఢీకొన్న లారీ

నరసరావుపేట రూరల్: రోడ్డుప్రమాదంలో బాలుడు దుర్మరణంపాలైన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెంలో ఆదివారం జరిగింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాలు పెట్లూరివారిపాలెం గ్రామానికి చెందిన మిట్టా కమల్(14) చికెన్ తెచ్చేందుకు ద్విచక్రవాహనంపై కోటప్పకొండకు బయలుదేరాడు. మార్గమధ్యంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చిన లారీ కమల్ ప్రయాణిస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కమల్ అక్కడికక్కడే మృతిచెందాడు. కమల్ ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

జీవీ కృష్ణారావు ఆశయ సాధనకు కృషి



సుబ్బారావుకు పురస్కారం అందిస్తున్న రవీంద్రనాథ్, అజయ్‌కుమార్

లక్ష్మీపురం: కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి, ముఠా కార్మిక సంఘం అభ్యున్నతి కోసం అంతిమ శ్వాస వరకు పాటుపడిన ఆదర్శ కమ్యూనిస్టు జీవీ కృష్ణారావు అని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కృషి చేస్తామని తెలిపారు. సంగడిగుంటంలోని రేగుల రాఘవయ్య భవన్‌లో ఆదివారం నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ నగర సమితి, ఏఐటీయూసీ నగర సమితి, జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీ కృష్ణారావు 8వ వర్ధంతి సభ ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను ఆవిష్కరించారు. జీవీకే చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. అనంతరం రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అనేక కార్మిక సంఘాలను నిర్మాణం చేయడమే కాకుండా ఉద్యమాలు నడపడంలో కార్మిక వర్గాన్ని ఐకమత్యంతో ముందుకు తీసుకెళ్లారన్నారు. ఆ సంఘాలు నేటికీ కొనసాగుతున్నాయని అన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ.. జీవీ కృష్ణారావు, వారి కుటుంబం కమ్యూనిస్టు భావాలతో పాటు నాస్తికత్వాన్ని, మూఢాచారాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమంలో పాలుపంచుకున్నట్లు గుర్తుచేశారు. జీవీ కృష్ణారావు తండ్రి పోలయ్య కూడా ఈ బాటలో విశేష కృషి చేశారన్నారు. దేశంలో బీజేపీ మత రాజకీయాలు చేస్తోందని ఆరోపించారు. జీవీ కృష్ణారావు హేతువాద భావాలు, నాస్తిక సిద్ధాంతాలు సమాజంలో ఎంతో అవసరమని పేర్కొన్నారు. ముఠా ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ.. కార్మిక సంక్షేమానికి కృషి చేసిన మహనీయుడు జీవీ కృష్ణారావు అని కొనియాడారు. అనంతరం జీవీ కృష్ణారావు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జీవీకే విశిష్ట పురస్కారాన్ని మున్సిపల్ ఫెడరేషన్ సీనియర్ నాయకులు నెక్కంటి సుబ్బారావుకు ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గేయాలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, జీవీకే మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ అమ్మిశెట్టి శివ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు, ఇఫ్టా జాతీయ కార్యదర్శి గని, ఏఐటీయూసీ నగర గౌరవాధ్యక్షులు జి.సురేష్ బాబు, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి ఆరేటి రామారావు, కార్పొరేటర్ సంకూరు శ్రీనివాసరావు, భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పుప్పాల సత్యనారాయణ, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు పులి సాంబశివరావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఆకిటి అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణవికి బెస్ట్ ఇంటీరియర్ డిజైనర్ అవార్డు



అవార్డు అందుకుంటున్న కాళంగి ప్రణవి

గుంటూరు మెడికల్: గుంటూరుకు చెందిన కాళంగి ప్రణవికి గ్లోబల్ చాంబర్ ఆఫ్ కన్స్యూమర్ రైట్స్, కిటెక్సాఫ్ట్ ప్రొడక్షన్స్ ఎల్ఎల్‌పీ సంయుక్తంగా అందజేసే ఇంటర్నేషనల్ ఎమినెన్స్ అవార్డులలో 2024 సంవత్సరానికిగాను బెస్ట్ కమర్షియల్ ఇంటీరియర్ డిజైనర్ అవార్డు లభించింది. ఈ అవార్డును ప్రణవి పంజాబ్ గురుగావ్‌లో ఏర్పాటు చేసిన 21వ ఎడిషన్ సమావేశంలో శనివారం రాత్రి అందుకున్నారు. ప్రణవి వ్యాపార రంగంలో ఇంటీరియర్ డిజైన్ ఆవశ్యకతను, అభివృద్ధిని విద్యార్థులకు నూతన పద్ధతులలో బోధించారు. బోధన, అభ్యాసం, అభ్యాస వాతావరణాన్ని పునర్నిర్మించడంలో ప్రణవి జరిపిన విశేష కృషికి గుర్తింపుగా ఈ అవార్డు అందించినట్లు న్యాయ నిర్ణేతలు ప్రకటించారు. ప్రణవి హైదరాబాద్ జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూ)లో బ్యాచిలర్ ఆఫ్ ఆర్కిటెక్ట్ పట్టాను పుచ్చుకున్నారు. తర్వాత హైదరాబాద్‌లో మిత్రులతో కలిసి స్టూడియోను ప్రారంభించారు. ఇంటీరియర్ డిజైన్ విభాగంలో మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ అవార్డు తనకు రావడం అదృష్టమని, తనకు భవిష్యత్‌లో ఇంకా ఎక్కువ ఉత్సాహంతో పనిచెయ్యడానికి ఇది ఉపకరిస్తుందని అన్నారు. ఈ అవార్డు రావడంపై ప్రణవి కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.